క్లుప్తంగా

పంచారామక్షేత్రం ఈఓగా సురేష్ నాయుడు

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక పంచారామ క్షేత్రం కార్యనిర్వహణ అధికారిగా చాగంటి సురేష్ నాయుడు బుధవారం బాధ్యతలను చేపట్టారు . కాళ్లకూరు వేకటేశ్వర స్వామి వారి దేవస్థానం ఈఓగా పనిచేస్తున్న ఆయన బదిలీపై పంచారామ క్షేత్రానికి వచ్చారు. ఈ సందర్భంగా ఈవో సురేష్ నాయుడు మాట్లాడుతూ గతంలో పంచారామ క్షేత్రం ఈఓగా ఏడేళ్లు పని చేశానని తెలిపారు. జిల్లాలోని భీమేశ్వర స్వామి దేవస్థానం, నరసాపురం గ్రూపు టెంపుల్స్ ఈఓగా పని చేశానన్నారు. పంచారామ క్షేత్రంలో త్వరలోనే నిత్య అన్నదానం ప్రారంభిస్తామన్నారు.

కోలాట నృత్యానికి బాలికలు, మహిళలు


కోలాట నృత్యానికి గజ్జకట్టి పూజ చేస్తున్న బాలలు, మహిళా బృందం

ఆకివీడు : మండలంలోని పెదకాపవరం గ్రామ బాలికలు, మహిళా బృందం కోలాట నృత్యానికి సిద్ధమవుతున్నారు. గ్రామంలోని కూర్మనాథ వేణుగోపాల స్వామి ఆలయంలో కోలాట బృందం బుధవారం గజ్జె కట్టి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో తిరుమల తిరుపతి దేవస్థానం వారి దాన సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో పడాల గోపాల కృష్ణ గురువు శిక్షణలో కోలాట నృత్యం నేర్పించారు. సుమారు 50 మంది మహిళలు, బాలికలు పాల్గొన్నారు. గ్రామపెద్ద కట్రెడ్డి మోహనరావు మాట్లాడుతూ గ్రామంలో తొలిసారిగా కూర్మనాథ వేణుగోపాల కోలాట బృందం ఏర్పడిందన్నారు. కోలాట బృందానికి తమ సహాయ సహకారాలు అందజేస్తున్నట్లు చెప్పారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించాలి

భీమవరం అర్బన్: తీర ప్రాంత గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరు అందించే విధంగా పంచాయతీ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు చర్యలు తీసుకోవాలని ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, రాష్ట్ర ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ కొప్పర్తి సత్యనారాయణలు కోరారు. మండలంలోని గూట్లపాడు గ్రామంలో బుధవారం రక్షిత మంచినీటి చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా తిరుమాని ఏడుకొండలు, కొప్పర్తి సత్యనారాయణలు మాట్లాడుతూ కాలువలు కట్టేస్తున్న నేపథ్యంలో రక్షిత మంచినీటి చెరువులకు పూర్తి స్థాయిలో నీటిని నింపాలన్నారు. వారి వెంట సర్పంచ్ ఒడుగు ముత్యాలరాజు, గ్రామ పెద్దలు ఉన్నారు.

22 నుంచి అమ్మవార్ల జాతర

కాళ్ల: కాళ్ల గ్రామ దేవతలు మహంకాళమ్మ, వెంకమ్మవార్లు జాతర ఏప్రిల్ 22 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు జాతర కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం ఆలయం వద్ద అమ్మవార్ల పందిరిరాట ముహూర్తం చేశారు. ఇటీవల అమ్మవార్లను పూరి గుడిసెలో పెట్టే సందర్భంగా గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవార్ల జాతర వైభవోపేతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు జాతర కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో పెంటపాటి వెంకట నాగేశ్వరరావు, సుంకర నాగేశ్వరరావు, బండి దొరయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన హరికథ సప్తాహ మహోత్సవాలు


హరికథ సప్తాహ మహోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక త్యాగరాజ భవనంలో చెరుకువాడ సోదరుల నిర్వహణలో హరికథ సప్తాహ మహోత్సవాలు ఘనంగా ముగిశాయి ముందుగా మావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థానం ఆస్థాన వేద పండితులు బ్రహ్మశ్రీ ఈమని రామచంద్ర ఘనాపాటి జ్యోతి ప్రజ్వలన చేసి దైవ సంకల్ప బలమే ఏ ధర్మ కార్యక్రమానికి అయిన పునాది అని, మనం కేవలం నిమిత్తపత్రులమని, 7 రోజులు శ్రీరామ గాథ హరికథలు నిర్వహించి అందరికీ శ్రీరాముని ఆశీస్సులు ఉండాలని భక్తి పూర్వకంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం శ్రీసత్యసాయి సేవా సమితి సహకారంతో 500 మందికి అన్న సమారాధన నిర్వహించారు. దాలిపర్తి రామారావు సన్నాయి బృందం, శ్రీసత్య సాయి భజన మండలి, శ్రీరామ భజన, దాసరి మల్లికార్జునరావు, కాపవరపు సుబ్బారావు సంగీత కచేరీ సుమారు 4 గంటలపాటు సాగింది. ఈ సందర్భంగా కళాకారులను సత్కరించారు. మాజీ ఎమ్మెల్సీ బొమ్మిడి నారాయణ రావు, గ్రంథాలయ మాజీ చైర్మన్ వబిలిశెట్టి కనకరాజు, మావుళ్ళమ్మ దేవస్థానం మాజీ చైర్మన్ గునుపూటి తిరుపాల్, డాక్టర్ గంధం వెంకట విశ్వేశ్వరరావు, నిర్వాహకులు చెరుకువాడ వెంకట్రామయ్య, రంగసాయి, పురిగళ్ళ రమణ మూర్తి, సాయి పవన్ , రాయప్రోలు చలపతి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి నిరంతర కృషి

డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహారావు


ఆకివీడు ఐదో వార్డులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న డీసీసీబీ చైర్మన్ నర్సింహారావు


తరటావ గ్రామంలో పైప్‌లైన్ నిర్మాణానికి భూమి పూజ చేసి, పొక్లెయిన్‌ను నడుపుతున్న డీసీసీబీ చైర్మన్ నర్సింహరాజు

ఆకివీడు: సంక్షేమం, అభివృద్ధి రెండుకళ్లుగా భావించి రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం పాటుపడుతున్నారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహారావు అన్నారు. స్థానిక నగర పంచాయతీ పరిధిలోని ఐదో వార్డులో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లిన పీవీఎల్, ప్రజాప్రతినిధులు, నాయకులకు ప్రజలు స్వాగతించారు. పథకాల లబ్ధి అందుతుండటంతో ఆనందం వ్యక్తం చేశారు. మంచినీరు, పైప్‌లైన్, పింఛన్ల సమస్యలను మహిళలు పీవీఎల్ దృష్టికి తీసుకొచ్చారు. మరమ్మతలకు గురైన పైప్‌లైన్‌ను వెంటనే పునరుద్ధరించాలని పంప్‌హౌస్ ఏఈని పీవీఎల్ ఫోన్‌లో ఆదేశించారు. మంచినీటి సమస్య తలెత్తితే తక్షణం చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలకూ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని చెప్పారు. అగ్రవర్ణ పేదలనూ ఈబీసీ పథకం ద్వారా ఆదుకుంటున్నారని తెలిపారు. అట్టడుగు, వెనుకబడిన తరగతుల పిల్లలు ఫీజు రీయంబర్స్‌మెంట్‌తో ఇంజినీర్లు, డాక్టర్లు, సాఫ్ట్‌వేర్లు అవుతున్నారని చెప్పారు. విద్యకు సీఎం జగన్ అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, వైస్‌చైర్మన్లు పుప్పాల పండు, వంగా జ్యోత్స్న, జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు (యండగండి శ్రీను), త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళి, అంబటి రమేష్, గుండా సుందరరామనాయుడు, మోరా జ్యోతి, జహంగీర్ హుస్సేన్, కౌన్సిలర్ తిమ్మారెడ్డి మాధవి, జగన్, శ్రీహరి, మన్నే లలితాదేవి, పోతరాజు, కుంకట్ల దానయ్య, చెలంకూరి చలపతి, మంతెన రామచంద్రరాజు, దాట్ల బోసురాజు, గుర్రం హరి, అచ్చారావు, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

జల జీవన్ పథకం పనులు వేగవంతం

ఆకివీడు: మంచినీటి సమస్య పరిష్కారానికి జల జీవన్ మిషన్ నిధులతో పైప్‌లైన్ల విస్తరణ, రక్షిత మంచినీటి పథకాల నిర్మాణ పనుల్ని వేగవంతం చేయాలని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు సూచించారు. ఆకివీడు మండలం తరటావ గ్రామంలో 1562 మీటర్ల మేర పైప్‌లైన్ విస్తరణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ మంజూరు జల జీవన్ మిషన్ పథకం లక్ష్యమన్నారు. శివారు ప్రాంతాల ప్రజలకు ఉచితంగా కనెక్షన్ మంజూరు చేస్తున్నారని చెప్పారు. తరటావ గ్రామంలో రోడ్డు నిర్మాణం, డ్రెయినేజీ సౌకర్యాలు కల్పించాలని సర్పంచ్ కూనపరాజు ప్రసాదరాజు, గ్రామ మహిళలు కోరగా, నియోజకవర్గ అభివృద్ధి నిధులు రూ.5 లక్షలు కేటాయిస్తానని, ఎంపీపీ నిధులు రూ.2.50 లక్షలు, జెడ్పీటీసీ రూ.5 లక్షలు నిధులతో రోడ్లు, డ్రెయినేజీ సౌకర్యం కల్పిస్తామని పీవీఎల్ హామీ ఇచ్చారు. జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు (యండగండి శ్రీను) మాట్లాడుతూ వెంకయ్య వయ్యేరు నుంచి తరటావ గ్రామంలోని మంచినీటి చెరువు వరకు పైప్‌లైన్ నిర్మాణంతో ఈ ప్రాంతంలో మంచినీటి సమస్య పరిష్కారమవుతుందన్నారు. రొయ్యల చెరువుల వల్ల పంట కాలువలు పాడైపోయాయని, దీంతో నేరుగా పైప్‌లైన్ ద్వారా మంచినీటిని చెరువులో నింపేందుకు పైప్‌లైన్ దోహదపడుతుందని చెప్పారు. ఎంపీపీ కఠారి జయలక్ష్మి, ఆకివీడు వైస్ చైర్మన్ పుప్పాల పండు, పాతపాటి శ్రీనివాసరాజు, కఠారి రామకృష్ణ, కేశవరావు, దింటకుర్తి వెంకన్న, మల్లారెడ్డి ప్రభాకరరావు, గంగుల హనుమాన్ ప్రసాద్, బోయిన రాము, దంతులూరి కృష్ణంరాజు, దాసరి వెంకటరత్నం, కోడే సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు


26వ వార్డులో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం


ఐదో వార్డు లో లబ్ధిదారులతో మాట్లాడి స్టిక్కర్ అతికిస్తున్న నాయకులు


బలుసుగొయ్యిలపాలెంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించడమేగా లక్ష్యంగా పనిచేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నివర్గాల ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ తోట భోగయ్య, వన్‌టౌన్ జేసీఎస్ కన్వీనర్ నల్లం రాంబాబు అన్నారు. బుధవారం పట్టణంలోని 3, 26 వార్డులో జగనన్నే మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగన్నాకార్యక్రమంలో భాగంగా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నాయకులు ఇంటింటికి తిరిగి గత మూడున్నర సంవత్సరాలుగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ప్రభుత్వ పాలనపై ప్రజల అభిప్రాయలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో 3వ వార్డు పార్టీ ప్రెసిడెంట్ మాదిరెడ్డి శ్రీనివాస్, సచివాలయ కన్వీనర్ పి.అరుణకుమారి, పార్టీ నాయకులు పైపూరి సూరిబాబు,సారపల్లి శ్రీనివాసు, పాచిపెంట నర్సింహమూర్తి, గృహసారథులు బరువుకోట సత్యవతి, కొల్లా లక్ష్మీ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

భీమవరం (ప్రకాశంచౌక్): పేదల సంక్షేమ ధ్యేయంగా పరిపాలన సాగిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అని డీసీఎంఎస్ చైర్మన్ వెంద్ర వెంకటస్వామి అన్నారు. జగనన్న నేమా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా భీమవరం ఐదో వార్డులో వేంద్ర వెంకటస్వామి గృహసారథులు పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు గూడూరి ఉమాబాల, జేసీఎస్ కన్వీనర్ చెల్లబోయిన సూర్య ప్రకాష్, పార్టీ నాయకులు చెల్లంకి గిరి, వేంద్ర విజయదుర్గ, మల్లుల శ్రీనివాసరావు, అల్లూరి నాగవల్లి, రుద్రాక్షల శ్రీనివాస్ పాల్గొన్నారు.

వీరవాసరంలో..

వీరవాసరం: జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాలను మండల వ్యాప్తంగా బుధవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిత్యం స్పందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అంతా బాసటగా నిలవాలని కోరారు. వీరవాసరంతో పాటు రాయకుదురు, కొణితివాడ, మడుగు పోలవరం, నేలపోగుల, తోలేరు, అండలూరు, నవుడూరు, బలుసుగొయ్యలపాలెం, పంజా వేమవరం, చింతలకోటి గరువు, వీరవల్లివారిపాలెం, తోకలపూడి, వడ్డిగూడెం, మత్స్యపురి, మత్స్యపురిపాలెం, తోకలపూడి, నందమూరి గరువు ,పెరికిపాలెం, బొబ్బనపల్లి మెంటేపూడి తదితర గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో జేసీఎస్ కన్వీనర్ మానుకొండ ప్రదీప్ కుమార్, గూడూరి ఓంకార్, గొలగాని సత్యనారాయణ, గెద్దం భారతి, చికిలే మంగతాయారు ,ఇళ్ల పూర్ణ బాల భారతి, పంజా ప్రసాద్, బీశెట్టి లక్ష్మి, నేతలు జ్ఞాన సుందరరాజు, గద్దం భాస్కరరావు, పంజా జానకి రామయ్య, బొల్లంపల్లి శ్రీనివాస్ చౌదరి నూకల కనకారావు, వేగేశ్న వర్మ రాజు పాల్గొన్నారు.

పథకాల పంట పండుతోంది

ఆకివీడు : పథకాలతో పంట పండుతోందని మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని తరటావ గ్రామంలో బుధవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. పథకాల లబ్ధి ఇంటి వద్దకే వచ్చి ఇస్తున్నారని ఉపాధి హామీ కూలీలు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు వద్ద హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్న మీరంతా వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

సీఎం జగన్‌కు అండగా నిలుద్దాం


బొండాడ గ్రామంలో స్టిక్కర్ అతికిస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ నాగరాజు

కాళ్ల: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి అండగా నిలబడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఉండి ఏఎంసీ మాజీ చైర్మన్ మన్నే నాగరాజు అన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా బుధవారం బొండాడ గ్రామంలో కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే నిర్వహించారు. టీడీపీ ప్రభుత్వానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఉన్న తేడాను వివరించారు. మళ్లీ జగన్ సీఎం అయితేనే ప్రతి మహిళకూ ఆర్థిక భరోసా ఉంటుందని నాగరాజు తెలిపారు. ప్రతి ఇంట్లోనూ ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన వారున్నారని చెప్పారు. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డిని, ఉండి ఎమ్మెల్యేగా పీవీఎల్ నరసింహరాజును గెలిపించుకోవాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. వారి అనుమతితో ఇళ్ల వద్ద స్టిక్కర్లంటించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మన్నె శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ నాయకులు పెనుమత్స రంగరాజు, సచివాలయ కన్వీనర్లు బురగా గాబ్రియేలు, వోనుముల ఆంజనేయులు, సేనాపతి వెంకటేశ్వర్లు, మందపాటి రవి, వాలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లు పాల్గొన్నారు.

జగనన్న విద్యాకానుక కిట్లు సిద్ధం

పాలకోడేరు: జగనన్న విద్యా కానుక కిట్ల భద్రతపై బాధ్యతగా వ్యవహరించాలని రాష్ట్ర పాఠ్యపుస్తక అభివృద్ధి అధికారిణి డి.మాధవీలత అధికారులకు సూచించారు. పాలకోడేరు జడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్ల నిల్వ కేంద్రాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అధికారులకు ఆమె పలు సూచనలు చేశారు. 2023-24 విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులందరికీ ఒకే దఫాలో విద్యా కానుక కిట్లను పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. జేవీకే నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించి ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఏఎంఓ ఎంఎస్ శ్రీమన్నారాయణ, సీఎంఓ ఎ.రామకోటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు పి.మహేష్బాబు, ఎంఈఓ పి.రామకృష్ణమూర్తి, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

రుణం తీర్చుకునేందుకు ప్రజలు సిద్ధం


ఉణుదుర్రులో బ్రోచర్‌ను అందిస్తున్న నాయకులు


యండగండిలో సర్వే చేస్తున్న సర్పంచ్, నాయకులు


కోరుకొల్లులో నిర్వహిస్తున్న మా నమ్మకం నువ్వే జగన్

ఉండి: సంక్షేమ పథకాలు అమలు చేస్తోన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకునేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని యండగండి సర్పంచ్ గోగులమండ చినకృష్ణమూర్తి అన్నారు. బుధవారం ఉండి మండలం యండగండిలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు వేణు, ప్రసంగి, టోనీ, గోపాలకృష్ణమూర్తి, బొడ్డు సూరమ్మ పాల్గొన్నారు.

ఉణుదుర్రులో..

ఉణుదుర్రు గ్రామంలో ఎంపీటీసీ అల్లూరి మాధవి ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. పథకాల లబ్ధిపై ఆరా తీసి, జగన్ పాలనపై ప్రజాభిప్రాయం సేకరించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి జి.సుందర్‌కుమార్, ఎంపీటీసీ అల్లూరి మాధవి, కూనపరాజు వర్మ, అంజిరాజు, గృహసాథులు పాల్గొన్నారు.

కోరుకొల్లులో..

పాలకోడేరు: మండలంలోని కోరుకొల్లు గ్రామంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మంతెన యోగీంద్రబాబు పాల్గొని సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులకు కిట్లు అందజేశారు. ఉప సర్పంచ్ చంటి రాజు, మండల గృహ సారథుల కన్వీనర్ పాలా రాధాకృష్ణ పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై శిక్షణ


భూసార పరీక్షలపై శిక్షణ ఇస్తున్న ఏడీఏ శ్రీనివాస్

కాళ్ల: గ్రామ వ్యవసాయ సహాయకులకు భూసార పరీక్షలపై బుధవారం స్థానిక మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఆకివీడు ఏడీఏ కె.శ్రీనివాస్ శిక్షణ ఇచ్చారు. భూసార పరీక్షలకు మట్టి నమూనాల సేకరణ, ఫలితాల ఆధారంగా ఎరువుల మోతాదు నిర్ణయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ సి.జయవాసుకి పాల్గొన్నారు.

భూ సాంద్రతకు మట్టి నమూనా పరీక్షలు

ఆకివీడు: సారవంతమైన భూమిని రక్షించుకోవాలని, భూసారాన్ని తెలుసుకుని పంటల సాగు చేపట్టాలని ఏడీఏ కేఎస్ఎస్ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఆర్బీకే వద్ద మట్టి నమూన పరీక్షలపై బుధవారం ఇన్‌చార్జీలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ మట్టి సేకరణ, పరీక్షల నిర్వహణపై పలు సూచనలు సూచించారు. భూమి సాంద్రతను కోల్పోతుందని ఆవేదన వ్యక్తంచేశారు. భూ సాంద్రత కోల్పోయిన ప్రదేశాలు, చౌడు భూములు, ముంపు భూములు తదితర వాటి గురించి వివరించారు. మట్టి పరీక్షల ద్వారా కోల్పోయిన సాంద్రతను సాధించేందుకు, వాడాలసిన ఎరువులపై రైతులకు తెలియజేసేందుకు శిక్షణ దోహదపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ ప్రియాంక, ఆర్బీకే ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

గొల్లవానితిప్పలో భూ రీసర్వే

భీమవరం అర్బన్: భూ వివాదాలు లేకుండా శాశ్వతంగా భూ హక్కు పత్రాలను రైతులకు అందజేసి వారికి మేలు చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు-భూ రక్ష పథకాన్ని ప్రవేశపెట్టారనిసర్వే ఆఫ్ ఇండియా టీమ్ డ్రోన్ పైలెట్ వి.ప్రసాద్ అన్నారు. భీమవరం మండలంలోని లోసరి గూట్లపాడు ఏరియాలోని గొల్లవానితిప్ప గ్రామపంచాయతీలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకంలో భాగంగా బుధవారం డ్రోన్ సహాయంతో భూములు రీ సర్వే చేసే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎ.ఆది మూర్తి నాయుడు, మండల సర్వేయర్ జి.నాగబాబు, వీఆర్‌వో ఎన్. విజయకుమారి పాల్గొన్నారు.

నేడు కోపల్లేలో గడపగడపకు మన ప్రభుత్వం

కాళ్ల: మండలంలోని కొపల్లే గ్రామంలో గురువారం రెండో రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభించే కార్యక్రమనికి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అధికారులు హాజరుకావాలని పేర్కొన్నారు.

16న ప్రభుత్వ ఉద్యోగుల కౌన్సిల్ సమావేశం

ఉండి: భీమవరంలో ఈ నెల 16న నిర్వహించే రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల జిల్లా ద్వితీయ కౌన్సిల్ సమావేశానికి అన్ని శాఖల, అన్ని తరగతుల ఉద్యోగులు తరలిరావాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘ భీమవరం డివిజన్ అధ్యక్షుడు కేడీఎస్ కెనడీ తెలిపారు. బుధవారం ఉండిలో గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం భీమవరం డివిజన్ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సమావేశాల పోస్టర్‌ను వారు విడుదల చేశారు. వి.ఆంజనేయులు, ఎస్.చిన్నారావు పాల్గొన్నారు.

డ్రెయిన్‌లోపడి వ్యక్తి గల్లంతు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం వ్యక్తి ప్రమాదవ శాత్తు డ్రెయిన్‌లో కాలుజారి పడిపోయి ఎంతసేపటికి ఆయన అచూకి దొరకకపోవడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం తోకతిప్ప గ్రామానికి చెందిన తుంగా ఏసురాజు తన స్నేహితుడితో కలిసి గ్రామంలో యనమదుర్రు డ్రెయిన్ బ్రిడ్జివద్ద కూర్చుని మాట్లాకుంటుండగా ఏసురాజు ప్రమాదవశాత్తు కాలు జారి డ్రెయిన్‌లో పడిపోయాడు. ఎంతసేపటికి అతని ఆచూకి దొరకకపోవడంతో ఆయన భార్య తుంగా లక్ష్మి ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ మహేశ్వరరావు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

నిత్యావసరాల పంపిణీ

సాక్షి, భీమవరం: గుడ్ పీపుల్స్ హెల్పింగ్ హ్యాండ్స్ చేస్తున్న సేవాకార్యక్రమాలు అభినందనీయమని వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ తోట భోగయ్య అన్నారు. పట్టణంలోని 25వ వార్డు చినపేటలో బుధవారం హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు గుంటి ప్రభు అధ్వర్యంలో తూర్పు గోదావరి జిల్లా కాకినాడ పట్టణానికి చెందిన శిలా ఆనంద కుమారి ఆర్థిక సహాయంతో పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ వన్‌టౌన్ కన్వీనర్ నల్లం రాంబాబు. భీమవరం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు యేలేటి న్యూటన్, పిల్లి ముసలయ్య పాల్గొన్నారు.

వ్యాపారులకు లైసెన్స్‌లు తప్పనిసరి

సాక్షి, భీమవరం: భీమవరం పట్టణం, ఆకివీడు, ఉండి, కాళ్ల మండలాల పరిధిలోని దుకాణాలు, సంస్థలు, వాహనాల యజమానులు లైసెన్స్ రెన్యువల్ చేయించుకోవాలని భీమవరం 2వ సర్కిల్ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కె.శివనాగమల్లేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనేకమంది లైసెన్స్ లేకుండా వ్యాపారాలు చేసుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. లైసెన్స్ కోసం గ్రామ, వార్డు సచివాలయం, మీసేవా కేంద్రాల్లోను లేదా స్వయంగా కార్మిక శాఖ పోర్టల్ ద్వారా లైసెన్స పొందవచ్చని పేర్కొన్నారు లైసెన్స్ లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తే జరిమానాలు తప్పవని హెచ్చరించారు.

బాధిత కుటుంబానికి సాయం

సాక్షి, భీమవరం: ఆపదలో ఉన్న పేదలకు కృష్ణ బలిజ సాధికారిక సంఘం చేస్తున్న సహాయం అభినందనీయమని భీమవరం ఏఎంసీ మాజీ చైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు అన్నారు. భీమవరం 4వ వార్డు నరసయ్య అగ్రహారానికి చెందిన అత్రగడ్డ పెద్దింట్లు 20 నెలల కాలంలోనే తండ్రి, తల్లి, అన్నను కోల్పోవడంతో బాధిత కుటుంబానికి బుధవారం రాష్ట్ర కృష్ణ బలిజ సాధికారిక సంఘం సభ్యుడు గంటా త్రిమూర్తులు రూ. 11 వేలు ఆర్థిక సహాయాన్ని నాగేశ్వరరావు చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో మామిడిశెట్టి ప్రసాద్, ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, లంకి శ్రీనివాస్, మద్దుల రాము పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు సన్నద్ధం

వీరవాసరం: రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణకు సర్వ సన్నద్ధం చేస్తున్నామని మండల వ్యవసాయ అధికారి గీతాదేవి తెలిపారు. నందమూరి గరువు లోని రైతు భరోసా కేంద్రాలను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా దాళ్వా ధాన్యాన్ని ఒబ్బిడి చేస్తున్నామని పేర్కొన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో ఉన్న మాయిశ్చర్ మెషీన్లు, వేయింగ్ మెషీన్లను, ఇతర సామగ్రిని పరిశీలించారు. కార్యక్రమంలో రవికుమార్, కళ్యాణి, శ్రీనివాసరావు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

గోగులమ్మ ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు

వీరవాసరం: స్థానిక శ్రీ గోగులమ్మవారి ఆలయానికి చెందిన హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించామని ఈఓ పులగం వేణుగోపాల్ తెలిపారు. హుండీ ఆదాయం రూ.40351 వచ్చిందన్నారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ చికిలే మంగతాయారు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

ఉండి: మండలంలోని యండగండిలో పేకాడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని, రూ.23,800, ఆరు సెల్‌ఫోన్లు, ఏడు ద్విచక్రవాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై కె.గంగాధరరావు తెలిపారు.

అన్నదమ్ములపై దాడి

ఉండి: స్థానిక రామానంద్‌నగర్ ప్రాంతానికి చెందిన టైల్స్, సీలింగ్ పనిచేసే కన్నిటి శివసాయి, రాజేష్ అనే అన్నదమ్ములు మంగళవారం గ్రామంలోనే పనిచేసే ప్రాంతంలో గొడవ జరిగింది. వారు పనిముగించుకుని ఇంటికి వచ్చేశారు. గొడవ నేపథ్యంలో అంజనపూడి సురేష్, అమరగంటి రాకేష్, పైలా మధుకుమార్ మరి కొందరు గొడవపడి శివసాయి, రాజేష్‌ల ఇంటికి వచ్చి దాడి చేశారు. గాయాలపాలైన శివసాయి, రాజేష్ భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కె.గంగాధరరావు తెలిపారు.